భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రోత్సవాలు

శోభాయాత్రలో పాల్గొన్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 11: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం రామగుండంలోని పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్‌తో కలిసి సీపీ పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొని భోజనం వడ్డించారు. అనంతరం వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. బ్యాండ్ మేళాలు, మహిళల కోలాటాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి విగ్రహాన్ని గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ , జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, ఏవో అశోక్ కుమార్, మంచిర్యాల పరిధిలోని సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి..

జైపూర్, సెప్టెంబర్ 11: గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జైపూర్ సమీపంలోని గోదావరినది వంతెనపై గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై మంచిర్యాల డీసీపీ భాస్కర్ కలిసి సీపీ పరిశీలించారు. భక్తులకు కల్పించాల్సిన వసతులు, ట్రాఫిక్, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

ఐసీఏఆర్‌లో తాండూర్ విద్యార్థిని ప్రతిభ

తాండూర్, సెప్టెంబర్ 11 : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రాలలో పరిశోధన, ఉన్నత విద్య, శిక్షణ రంగం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో తాండూర్ మండల విద్యార్థిని ప్రతిభ చూపింది. మాదారం టౌన్‌షిప్‌నకు చెందిన సింగరేణి కార్మికుడు దుగుట శ్రీనివాస్-స్వప్న కుమార్తె శ్రీజ జాతీయస్థాయిలో 81వ ర్యాంక్, ఎస్సీ కేటగిరీలో 7వ ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం ముంబైలో పీజీ చేస్తున్నది. ఆమెను స్నేహితులు, బంధువులు, అధికారులు, నాయకులు, మండల వాసులు అభినందించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 11 : ప్రతి ఒక్కరూ తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మంచిర్యాల డీఎల్పీవో ధర్మారాణి సూచించారు. మండలంలోని వెంకట్రావుపేట, దొడేపల్లి, పాతకొమ్ముగూడెం, కొత్త కొమ్ముగూడెం గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఎంపీడీవోతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామాల్లోని మురుగు కాలువల్లో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అనంతరం వెంకట్రావుపేట పీహెచ్‌సీని పరిశీలించి, జ్వరపీడితులు ఎంత మంది ఉన్నారని, రోజూ ఔట్ పేషెంట్స్ ఎంతమంది వస్తున్నారని, వారికి సరిపడా మందులు ఉన్నాయా అని వైద్యుడు సతీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు వంశీకృష్ణ, సుజాత, రాజశేఖర్, ఈజీఎస్ ఏపీవో వెంకటరమణ తదితరులున్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆర్టీసీ కార్గో సేవలను ప్రారంభిస్తున్న మేనేజర్ బీ పాల్

తాండూర్, సెప్టెంబర్ 11 : తాండూర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కార్గో మేనేజర్ బీ పాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంచిర్యాల డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్గో సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆదిలాబాద్ రీజియన్ సేల్స్ టీం మెంబర్స్ కే సాయన్న, బీ రమేశ్, ఎంఏ రావు, ఎం మల్లేశ్, నాయకులు సిరంగి శంకర్, ఎండీ ఈసా, ఏజెంట్ చంద్రగిరి విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌లో కొనసాగుతున్న బందోబస్తు

జైనూర్, సెప్టెంబర్ 11 : జైనూర్‌లో ఆసిఫాబాద్ డీఎస్పీ రమణ పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగుతున్నది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు నుంచి ఆధార్‌కార్డులు చూసిన తరువాతే ప్రజలను అనుమతిస్తున్నారు. నిత్యావసర సరుకుల కోసం ప్రజలు బయటికి వెళ్తున్న నేపథ్యంలో లోకల్, నాన్‌లోకల్ విచారణ చేసి, అనుమతినిస్తున్నారు. ఈ ఘటనలో నిందితుల అరెస్టుల పర్వం కొనసాగుతున్నది. ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

కార్యవర్గ సమావేశంలో టీఎన్జీవో నాయకులు

హాజీపూర్, సెప్టెంబర్ 11 : హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘ భవన కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన టీఎన్జీవో ఆఫీసర్స్ యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడిని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రి, సెప్టెంబర్ 11: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి అనిత వైద్య సిబ్బందికి సూచించారు. మందమర్రి పట్టణంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. మండల వైద్యాధికారి రమేశ్, మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రాజేశ్వర్, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

లాడ్జీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 11 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని లాడ్జీల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. లాడ్జీల యజమానులు, నిర్వాహకులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పూర్తి వివరాలు తెలిపిన వారికే రూములు అద్దెకు ఇవ్వాలని, అనుమానాస్పదంగా ఎవరువచ్చినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రాత్రి 10 తర్వాత అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన వారికే రూములు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'వందే భారత్'కు హాల్టింగ్ ఇవ్వాలి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 11 : నాగ్‌పూర్-సికింద్రాబాద్‌కు ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే వందేభారత్ రైలుకు బెల్లంపల్లి, మంచిర్యాల రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ ఇవ్వాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ కోరారు. మహారాష్ట్రలో పలు స్టేషన్లలో హాల్టింగ్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో కేవలం రామగుండం, కాజీపేట స్టేషన్లలోనే హాల్టింగ్ ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 11 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి కాకతీయ యూనివర్సిటీ పీజీ రెగ్యులర్ కోర్సులను అందుబాటులో ఉంటాయని ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, పీజీ కో ఆర్డినేటర్ మేడ తిరుపతి తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తో పాటు ఎంఏ ఇంగ్లిష్, ఎంకామ్ కోర్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. 18 నుంచి రెండో విడుత పీజీ సీట్ల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని తెలిపారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్
- ఘనంగా అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ఆసిఫాబాద్ టౌన్ : అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 11 : అటవీ శాఖ అమరవీరుల త్యాగాలు మరువలేనివని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ పేర్కొన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ స్మరణార్థం యేటా అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అటవీ అధికారులు షేక్ హైదర్, గౌస్ మోహియొద్దీన్, కొండాల్ రావ్, శ్రీహరి విధి నిర్వహణలో వివిధ సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. తమ ప్రాణాలను లెక్కచేయకుండా కలప స్మగ్లర్లతో పోరాటం చేసి, దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అటవీశాఖ అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఇప్పటివరకు 3 దశాబ్దాల్లో సుమారు 32 మంది అటవీ అధికారులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్, డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేశ్, సరోజ రాణి, కార్యాలయ సిబ్బంది, జిల్లా, డివిజన్ అటవీ శాఖ సిబ్బంది, ఆసిఫాబాద్ రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం, సెప్టెంబర్ 11 : జన్నారం మండల కేంద్రంలోని డివిజన్ కార్యాలయం ఎదుట ఇన్‌చార్జీ రేంజ్ ఆఫీసర్ సుష్మారావు ఆధ్వర్యంలో అటవీ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అటవీ అధికారులు డివిజన్ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డుపై ర్యాలీ తీశారు. డీఆర్వో హేమలత, పూడూరి పోచమల్లు, రవి, శ్రీనివాస్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్, సెప్టెంబర్ 11 : చెన్నూర్ పట్టణంలో అటవీ అధికారులు ర్యాలీ తీశారు. అనంతరం సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో అమరులకు నివాళులర్పించారు. చెన్నూర్, కోటపల్లి రేంజ్ అధికారులు అప్పలకొండ, సదానందం, డిప్యూటీ రేంజర్ ప్రభాకర్, అధికారులు ప్రమోద్, లావణ్య, అటవీశాఖ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 11 : పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని అటవీ క్షేత్ర అధికారి కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ అమరులకు నివాళులర్పించారు. అటవీ శాఖ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జమీల్, ఎఫ్ఎస్వో జగన్మోహన్, బీట్ ఆఫీసర్లు, వాచర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

దండేపల్లి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి, సెప్టెంబర్ 11 : పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. దండేపల్లి పీహెచ్‌సీతో పాటు, కొర్విచెల్మ జడ్పీ పాఠశాల, కర్ణపేటలోని కేజీబీవీలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యం విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి, రిజిస్టర్లు, రికార్డ్స్ రూం, ధరణి సహాయ కేంద్రాలను పరిశీలించారు. ధరణి అభ్యర్థుల దరఖాస్తులు సక్రమంగా నింపాలన్నారు. ఆ తర్వాత ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. రిజిస్టర్లు, ప్రజాపాలన సేవా కేంద్రాల పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, వైద్యాశాఖాధికారులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 11 : విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన నాణ్యమైన భోజనం అందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, భోజనశాల, మూత్రశాలలు, వాటర్ ట్యాంక్, పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. నూతనంగా మంజూరైన పాఠశాల భవనాల నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వార్డెన్ కిషన్, పీడీ మధుసూదన్, ఉపాధ్యాయులు జాదవ్ కిరణ్ కుమార్, ప్రేమలత, అనిత, లక్ష్మీనారాయణ, గోపాల్, జాగేశ్వర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి..

జిల్లాలోని ప్రైవేట్ దవాఖానలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఎంహెచ్‌వో తుకారాం భట్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు దవాఖానలను ఆకస్మికంగా సందర్శించారు. వార్డులు, ల్యాబ్, పరిసరాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ రకాల వైద్య సేవల కోసం ప్రైవేటు దవాఖానలకు వస్తుంటారని, ప్రస్తుత వర్షాకాల నేపథ్యంలో రక్త పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత సరైన చికిత్స అందించాలని తెలిపారు. ఆయన వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకుఆర్థిక సాయం..

జిల్లాకు చెందిన ఇద్దరు పేద విద్యార్థులకు ఉన్నత చదువు కోసం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సీఈవో కోటయ్య నాయక్‌తో కలిసి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి ఆర్థిక సాయం చెక్కును కలెక్టర్ అందజేశారు. సిర్పూర్ (యూ) మండలం పూలారాకు చెందిన మర్సుకోల బాదిరావు కొడుకు కృష్ణ బీటెక్ ఫస్టియర్ ఐఐటీ రాయ్‌చూర్‌లో, వాంకిడి మండల కేంద్రానికి చెందిన దుర్గం మహేందర్ కొడుకు అర్జున్ జోద్‌పూర్‌లో చదువుతున్నారని పేర్కొన్నారు. వీరి చదువు కోసం ల్యాప్ టాప్ కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.50 వేలు అందించినట్లు తెలిపారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

నస్పూర్, సెప్టెంబర్ 11 : జిల్లాకు సంబంధించి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా రూపకల్పనలో పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమం 50 శాతం పూర్తయ్యిందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 2, 3 ఎపిక్ కార్డులున్న వారి వివరాలు సేకరించి, తగు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారందరు ఒక పోలింగ్ కేంద్రంలోకి వచ్చేలా జాబితా రూపొందించాలన్నారు. అక్టోబర్ 19 నుంచి 28 వరకు కొత్తగా నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపుల కోసం ఫారం 1 నుంచి 8 వరకు అందిన దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. ముసాయిదా జాబితా తయారు చేసి, అక్టోబర్ 29న ప్రచురించడం జరుగుతుందన్నారు. 2025, జనవరి 1న తుది జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఆర్డీవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం అక్షరాస్యతకు కృషి చేయాలి

వంద శాతం అక్షరాస్యత దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లక్ష మందికిపైగా నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించినట్లు, ఇందులో మొదటి విడుతలో 20,425 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నిర్దేశించినట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, డీఈవో యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఆర్డీవో కిషన్, మైనార్టీ సంక్షేమాధికారి రాజేశ్వరి, పోటు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 11 : పొరపాట్లకు తావులేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని, అధికారులకు రాజకీయ పార్టీలు సహకరించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నా రు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2025 లో భాగంగా ఇంటింటా సర్వేపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు గత నెల 20వ తేదీ నుంచి ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగిస్తున్న ఇంటింటా సర్వే 59 శాతం పూర్తయ్యిందని, పూర్తిస్థాయిలో జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఇప్పటివరకు 699 మంది ఓటర్లు గ్రామాన్ని వదిలివెళ్లారని, 992 మంది మరణించారని, 356 మంది ఫొటోలు జా బితాలో సరిగా లేవని, 291 మంది రెండుసార్లు ఉన్నారని బూత్‌స్థాయి అధికారులు గుర్తించినట్లు చెప్పారు. ఈనెల 20వ తేదీలోగా ఇంటింటా సర్వేను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణకు చర్యలు

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణ దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్, ఆసిఫాబాద్ ఆర్డీవోతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపర్చిన 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఉపయోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గదిని తెరచి, ఈవీఎంలను గోదాముకు తరలించారు. గోదాము పటిష్ట భద్రత కల్పించడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నటుల తెలిపారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 11: మంచిర్యాల పట్టణంలో జన్మభూమినగర్‌లోని వెంకటేశ్వర డీలక్స్ లాడ్జిలో నిర్వహిస్తున్న వ్యభిచార ముఠా గుట్టు రట్టయింది. ఆరుగురు విటులు, లాడ్జి ఓనర్, లాడ్జి మేనేజర్, అతని భార్య, నలుగురు మహిళలను పట్టుకున్నట్లు పట్టణ సీఐ బన్సీలాల్ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. లాడ్జి ఓనర్ ఏనుగు నారాయణ లాడ్జి వ్యవహారాలు చూసేందుకు నెన్నెల మండలం జెండా వెంకటాపూర్‌కు చెందిన గోదరి దుర్గయ్య, అతని భార్య శైలజను నియమించాడు. వీరు లాడ్జి చుట్టు పక్కల హాస్పిటళ్లకు వచ్చే అమాయక పేద మహిళలకు షార్ట్ ఫిల్మ్స్‌లో అవకాశం కల్పిస్తామని, డబ్బు ఇస్తామని చెప్పి మోసం చేస్తూ లాడ్జికి తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నారు. సమాచారం అందుకొని పోలీసులు తనిఖీలు చేయగా సీసీసీ నస్పూర్‌కు చెందిన మంతెన శ్రావణ్, పెద్దపల్లికి చెందిన బొడ్డుపల్లి శివకుమార్, వేమనపల్లికి చెందిన కూకట్ల పురుషోత్తం, నెన్నెల మండలం కోనంపేటకు చెందిన పెరుగు సాయిప్రసాద్, బెడ్డల రాహుల్, మందమర్రికి చెందిన కన్నం శ్రావణ్ కుమార్, మేనేజర్, లాడ్జి ఓనర్ మొత్తం 8 మంది పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్ కోసం కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు సనత్ కుమార్, రాములు, వినీత, ఏఎస్ఐ సత్తయ్య, వెంకన్న, బ్లూకోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-63 బాధితులకు ఊరట

హాజీపూర్, సెప్టెంబర్ 11 : నేషనల్ హైవే-63లో భూములను కోల్పోతున్న హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల బాధితులకు రెండువారాలు గడువును ఇస్తు హైకోర్టు ఇంటీరియం డైరెక్షన్ ఆర్డర్ ఇవ్వడంతో బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి బాధితులు హైకోర్టు ఆర్డర్‌తో పాటు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు తుల మధుసూదన్ మాట్లాడుతూ రైతులందరూ కోర్టును ఆశ్రయించగా తాత్కాలికంగా ఈ ఆర్డర్‌ను ఇచ్చిందన్నారు. పాత రోడ్డు ప్రకారం రహదారిని అభివృద్ధి చేస్తే ఎవరికీ నష్టం ఉండదని కోర్టుకు తెలిపారన్నారు. రైతుల ఆవేదనను గుర్తించి ఎవరికీ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు విచారణ జరుగుతుండగా రైతులను రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెట్టవద్దని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎన్ జనార్దన్ రెడ్డి, పెట్టం తిరుపతి, కొండల్ రెడ్డి, కట్ల మల్లేశ్, దేవయ్య, మధుకర్, రాజిరెడ్డి, అశోక్, పలువురు రైతులు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 11 : లక్షెట్టిపేట పట్టణంతో పాటు, వివిధ గ్రామాల్లోని సుమారు 8మంది డీజే నిర్వాహకులను బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. గణేశ్ నవరాత్రుల సందర్భంగా నిమజ్జనంలో డీజేలకు ప్రభుత్వం అనుమతులు నిలిపివేసిందన్నారు.

కోటపల్లి, సెప్టెంబర్ 11 : మండలంలోని డీజే యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఉత్సవాలు శాంతయుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

తాండూర్, సెప్టెంబర్ 11 : తాండూర్, మాదారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని డీజే యజమానులను తాహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐలు డీ కిరణ్‌కుమార్, సౌజన్య తెలిపారు.

జన్నారం, సెప్టెంబర్ 11 : మండల కేంద్రంతో పాటు, 29 గ్రామాల్లో డీజేలు నడుపుతున్న 8 మంది యజమానులను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు

కోటపల్లి, సెప్టెంబర్ 11 : కోటపల్లి మండలంలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెత్త పేరుకుపోగా, తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి అరుణ శ్రీ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సూచించారు.

పాఠశాలల వద్ద శుభ్రత పాటించాలి

దహెగాం, సెప్టెంబర్ 11 : పాఠశాలల వద్ద శుభ్రత పాటించాలని దహెగాం మండల ప్రత్యేకాధికారి సజీవన్ అన్నారు. కోత్మీర్, చౌక, లగ్గాం గ్రామాల్లో బుధవారం పర్యటించి, పాఠశాలలను సందర్శించారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో రాజేందర్, ఏపీవో కల్పన, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 11 : పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. పట్టణంలోని అర్బన్ దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం లాల్ బహదూర్ శాస్త్రి కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించాలన్నారు. వైద్య సిబ్బంది, కాలనీ ప్రజలు ఉన్నారు.

అంబేద్కర్ చౌరస్తాలో నిరసన

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 11 : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి అధ్యక్షుడు డోంగ్రె సునీల్ మాట్లాడారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆ సమితి ప్రతినిధులు ఇస్తార్, అజయ్‌కుమార్, తిరుపతి, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

దండేపల్లి, సెప్టెంబర్ 11 : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పాత రమేశ్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు నల్మాస్ కొమురయ్య, కార్యదర్శి రాస శరత్, కోశాధికారి గడ్డం శంకరయ్య, రాస శ్రీధర్, గడ్డం శంకరయ్య ఉన్నారు.

డయాలసిస్ రోగులకు వసతి కల్పించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 11 : డయాలసిస్ రోగులకు పూర్తి స్థాయి వసతి, సౌకర్యాలు కల్పించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారంకు హైదరాబాద్ నిమ్స్ దవాఖాన నెఫ్రాలజిస్ట్ డాక్టర్ గంగాధర్ సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని డయాలసిస్ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. రోగుల వివరాలు, సౌకర్యాలు తెలుసుకొని, దవాఖాన ఆవరణను పరిశీలించారు. దవాఖాన పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయని శుభ్రం చేయించాలన్నారు.

జిల్లాను ఉన్నతస్థానంలో నిలపాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 11 : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2024లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను అగ్రస్థానంలో నిలుపాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించి శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కేంద్ర విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా 3, 6, 9 తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రకారం జిల్లాలో 10 పాఠశాలలను ఎంపిక చేసి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమన్వయకర్త శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 11 : మున్సిపల్ పరిధిలో కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని నస్పూర్ కమిషనర్ చిట్యాల సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే కాలువలపై నిర్మాణాలు చేసి ఉంటే మూడు రోజుల్లో తొలగించుకోవాలని, లేకపోతే మున్సిపల్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే మొరం నింపుకోవాలని తెలిపారు.

మూడోరోజూ కొనసాగిన సర్వే

భీమారం, సెప్టెంబర్ 11 : భీమారం ఊర చెరువు సర్వే మూడు రోజులుగా కొనసాగుతున్నది. చెరువు శిఖంతో పాటు, బఫర్ జోన్, చెరువును కబ్జా చేశారని కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేయగా, బుధవారం కూడా రెవెన్యూ, ఇరిగిషన్, అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, అధికారులు ఉమ్మడిగా సర్వే చేస్తున్నట్లు ఆర్ఐ స్రవంతి తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 11 : మండలంలోని చిర్రకుంట, ఆదిల్‌పేట్ మామిడిగట్టు పంచాయతీలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను బుధవారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత, ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య పనుల నిర్వహణపై కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. వారి వెంట కార్యదర్శులు శిరీష, సంధ్యారాణి, హిమబింధు ఉన్నారు.

వాంకిడి ఎంపీడీవోగా ప్రభుదయ

వాంకిడి, సెప్టెంబర్ 11 : వాంకిడి ఎంపీడీవోగా ప్రభుదయ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన నస్రుల్లా ఖాన్ బదిలీపై బెజ్జూర్‌కు వెళ్లగా, సిర్పూర్(యూ) ఎంపీవోగా పని చేస్తున్న ప్రభుదయ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వీరభద్రీయ మండల కమిటీ

తాండూర్, సెప్టెంబర్ 11 : వీరభద్రీయ కుల సంఘం తాండూర్ మండల కమిటీని బుధవారం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోపాల్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్యాల రమేశ్, ఉపాధ్యక్షుడిగా బానాల రవి, ప్రధాన కార్యదర్శి మల్యాల రాజు, కోశాధికారి బానాల తిరుపతి, సహాయ కార్యదర్శి మల్యాల రమణ ఎన్నికయ్యారు.

ఏఈవోలకు సమాచారం ఇవ్వాలి

చెన్నూర్ రూరల్, సెప్టెంబర్ 11 : రైతు బీమా కలిగి అర్హత ఉన్న రైతు చనిపోతే మారిన రైతు బీమా గైడ్‌లైన్స్ ప్రకారం రెండు రోజుల్లోగా సంబందిత ఏఈవోకు సమాచారం ఇవ్వాలని చెన్నూర్ ఇన్‌చార్జి ఏవో మార్క్ గ్లార్డ్‌స్టన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీకి ప్రాథమిక సమాచారం కింద మృతిచెందిన రైతు వివరాలు, మృతికి గల కారణాలతో పాటు, నామినీ వివరాలను బీమా పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఫ్రెషర్స్ పార్టీలో లొల్లి

పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ విద్యార్థులను

చితకబాదిన బయటి వ్యక్తులు

కళాశాల ఎదుట బైఠాయించిన విద్యార్థి సంఘాల నాయకులు

విద్యార్థులను చితకబాదుతున్న బయటి వ్యక్తులు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 11 : మొబైల్ ఫోన్ కోసం ఫ్రెషర్స్ పార్టీలో జరిగిన లొల్లి...విద్యార్థులను చితకబాదే వరకు వెళ్లిన ఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కలకలం రేపింది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం..పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం సాయంత్రం ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. కళాశాలకు సెల్‌ఫోన్‌లు తీసుకు రావద్దని సీనియర్ విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు సూచించడంతో వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని మొదటి సంవత్సరానికి చెందిన ఓ విద్యార్థి తన స్నేహితులకు చెప్పి కళాశాలకు పిలిపించాడు. వారు గంజాయి, మద్యం మత్తులో తూలుతూ వచ్చి సీనియర్లపై దాడులకు దిగారు. తృతీయ సంవత్సరానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కళాశాల సిబ్బంది హుటాహుటినా విద్యార్థులను దవాఖానకు తరలించారు. దాడికి పాల్పడిన వారిపై గాయాలపాలైన విద్యార్థులు, లెక్చరర్లతో కలిసి బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో దేవయ్యను వివరణ కోరగా విద్యార్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యార్థి సంఘాల నాయకుల ఆందోళన

కళాశాలలోకి బయట నుంచి వ్యక్తులు వచ్చి విద్యార్థులు దాడి చేయడంపై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కళాశాలలోని విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వక్తం చేశారు. దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరు చాలా నిర్లక్ష్యంగా ఉందని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సాగర్, దీపక్ కుమార్, క్రాంతికుమార్, మురళి, శ్రావణ్, రెడ్డి శ్రావణ్ పాల్గొన్నారు.